వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 179 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | డిసెంబర్ 2024 | వెల : రూ 10/-





# బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ వైపా?

- అదానీ, ప్రధానీ తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ఈ అవినీతిపై మీ వైఖరేంటి ? బీఆర్ఎస్‌కు సీఎం సూటి ప్రశ్న
- అక్రమాలపై శాసనసభలో చర్చకు కాంగ్రెస్ సిద్ధమంటూ స్పష్టీకరణ
- తన స్నేహితుడిని కాపాడుకునేందుకే మోడీ యత్నిస్తున్నారని విమర్శ
- అదానీ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు రాజ్‌భవన్ ఎదుట ధర్నా
- పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్

అదానీ అవినీతిపై బీఆర్ఎస్ తన వైఖరి వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ తన విధానం ప్రకటించకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలతో పాటు మణిపూర్ అల్లర్ల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని బుధవారం

-మిగతా 3 లో




# అమిత్ షా క్షమాపణ చెప్పాలి

- మంత్రి పదవి నుంచి తొలగించాలి : ఖర్గే
- అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం
- సహించదు : రాహుల్

న్యూఢిల్లీ

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ దద్దరిల్లింది. 'జై భీమ్.. జైజై భీమ్', 'అమిత్ షా క్షమాపణ చెప్పాలి' అంటూ నినాదాలు హోరెత్తాయి. అమిత్ షాను కేంద్ర హోంమంత్రిని పదవి నుంచి తొలగించాలంటూ

-మిగతా 3 లో



## మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం..

భారత్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్

తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం

-మిగతా 3 లో

## భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత

- అనుభవదారుని కాలం మళ్లీ చేర్చాం
- ప్రతి రైతుకూ భూధార్ కోడ్
- పార్ట్-బి భూముల సమస్యను పరిష్కరిస్తాం
- సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తాం
- అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి




ప్రతి గ్రామానికీ రెవెన్యూ అధికారి

హైదరాబాద్

భూ భారతి చట్టం-2024 ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యంగా బిల్లును ప్రవేశపెడుతున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అనుభవదారుని కాలాన్ని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు.

-మిగతా 3 లో



## నివాసమున్న గృహాలను హైడ్రా కూల్చదు

-ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తాం
-అనుమతులు ఇచ్చిన అధికారులు కూడా బాధ్యులే..
- భూ కబ్జాల వెనుక ఉన్న పాత్రదారులు, సూత్రదారులపై కఠిన చర్యలు
-కమిషనర్ ఐజీ రంగనాథ్

హైదరాబాద్

హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని, అయితే ఎఫ్‌టీఎల్‌లో

-మిగతా 3 లో




## జమిలి బిల్లుపై 31 మందితో జెపిసి

-1 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులకు చోటు

న్యూఢిల్లీ

'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును పరిశీలించడానికి 31 మంది సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి రాజ్యాంగం, సంబంధిత

-మిగతా 3 లో



## కోర్టు తలుపులు తెరిచే వుంటాయి

ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేసే రైతులకు సుప్రీం హామీ

న్యూఢిల్లీ

ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతుల కోసం తమ తలుపులు తెరిచే వుంటాయని, అవసరమైన సూచనలు, సలహాలు పొందవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. తమ సమస్యల గురించి చెప్పడానికి వారు

-మిగతా 3 లో

## డ్రంకెన్ డ్రైవ్‌తో అసెంబ్లీ హీట్





- హరీశ్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వాగ్వాదం
- కాళేశ్వరంపై పదివేల కోట్లు దోచుకున్నవ్ : కోమటిరెడ్డి
- తాగొచ్చి సభలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు : హరీశ్‌రావు
- ఇరువురి వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటన

-హైదరాబాద్

శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఒకరిపై మరొకరు ప్రత్యారోపణలు చేసుకుంటూ

-మిగతా 3 లో


# రష్యా బలగాల అదుపులో మాస్కో బాంబు పేలుడు అనుమానితుడు

ఘటన నుంచి బయటపడిన డ్రైవర్



మాస్కో : సీనియర్ సైనిక జనరల్ సహా ఇద్దరు మృతికి కారణమైన మాస్కో బాంబు పేలుడుకు సంబంధించి అనుమానితుడిని తమ అదుపులోకి తీసుకున్నట్లు రష్యన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎఫ్ఎస్‌బి బుధవారం తెలిపింది. ఆ అనుమానితుడు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ రిక్రూట్ చేసుకున్న ఉజ్బెక్ పౌరుడని పేర్కొంది. ఆ వ్యక్తి పేరును ఎఫ్ఎస్‌బి వెల్లడించలేదు. ఉక్రెయిన్ తనను నియమించిందని ఆ వ్యక్తే చెప్పాడని, 30ఏళ్ల లోపు వయసు వుందని తెలిపింది. ఉక్రెయిన్‌లో మాస్కో మిలటరీ ఆపరేషన్ సందర్భంగా చేపట్టిన చర్యలపై బ్రిటన్, కెనడాలతో సహా పలు దేశాల నుండి రష్యా సైనిక జనరల్ కిరిలొవ్ ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. నిషేధిత రసాయన ఆయుధాలతో యుద్ధం చేస్తున్నారంటూ సోమవారం ఉక్రెయిన్ ఆయనపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టగా, మంగళవారం బాంబు దాడిలో చనిపోయారు. ఈ దాడిలో కిరిలొవ్ ప్రయాణిస్తున్న కారు బాగా దెబ్బతినగా, డ్రైవర్ గాయాలతో బతికి బయటపడ్డాడు. తన నివాసం నుండి కిరిలొవ్ బయటకు రాగానే రిమోట్ పరికరంతో పేలుడు పదార్థాలను పేల్చివేసినట్లు భావిస్తున్నారు. పేలుడుకు 1.5 మీటర్ల దూరంలోనే వున్న కిరిలోవ్ ఆయన సహాయకుడు చనిపోయారు. ఆ సమయంలో డ్రైవర్ తన అధికార వాహనంలో వున్నారు. ఆ పేలుడు ధాటికి డ్రైవర్ కంగారు పడ్డాడు. పదునైన ముక్కలు ముఖంపై లోతుగా గుచ్చుకుపోవడంతో డ్రైవర్ ముఖం గుర్తు పట్టడానికి వీల్లేకుండా పోయింది. ఉక్రెయిన్ స్పెషల్ సర్వీసెస్ ఈ దాడికి పాల్పడ్డాయని రష్యా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

# ముంబై తీరంలో పడవ ప్రమాదం. 13 మంది మృతి




హైదరాబాద్

ముంబై తీరంలో జరిగిన పడవ ప్రమాదంలో 13 మంది మృతి చెందినట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. 101 మందిని కాపాడినట్లు తెలిపారు. చనిపోయిన వారిలో 10 మంది పర్యటకులు కాగా.. ముగ్గురు నేవీ సిబ్బంది ఉన్నట్లు ప్రకటించారు. పర్యాటకులతో వెళ్తున్న పడవను నేవీకి చెందిన స్పీడ్‌బోటు ఢీకొట్టడంతో ఈ విషాదం చోటుచేసుకుంది.
'గేట్ వే ఆఫ్ ఇండియా' నుంచి ఎలిఫెంటా గుహలకు 'నీల్‌కమల్' అనే ఫెర్రీ.. దాదాపు 100 మందికి పైగా పర్యటకులతో బయలుదేరింది. ఈ క్రమంలో చక్కర్లు కొడుతూ వేగంగా వచ్చిన నేవీకి చెందిన ఓ స్పీడ్ బోటు దాన్ని బలంగా ఢీకొట్టింది. దాంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 13కి చేరింది. అయితే, ఘటనా సమయంలో ఫెర్రీతోపాటు నేవీ బోటులో ఎంత మంది చొప్పున ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు. ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే రెస్క్యూ బృందాలు భారీ ఆపరేషన్ చేపట్టాయి. 11 నేవీ పడవలతో సహా తీర ప్రాంత దళాలకు చెందిన మూడు పడవలు, నాలుగు హెలికాప్టర్లు కూడా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. పోర్టు అధికారులు, కోస్ట్‌గార్డ్, మత్స్యకారుల సహాయక చర్యల్లో పాల్గొని 101 మందిని కాపాడాయి.

# కేరళలో మంకీ పాక్స్ కలకలం..


-హైదరాబాద్



కేరళలో మంకీ పాక్స్ కలకలం రేగింది. యూఏఈ నుంచి ఇటీవల కేరళకు వచ్చిన ఇద్దరికి పాజిటివ్ లక్షణాలు కనిపించాయి. ఇద్దరు వ్యక్తులకు జ్వరం, తలనొప్పి, శరీరంపై పలు చోట్ల పొక్కులు వచ్చి నీటి బొడిపెలుగా మొదలై ఎరుపు, నలుపు రంగులోకి మారాయి. దీంతో వైద్యులు పరీక్షలు చేసి మంకీ పాక్స్ సోకినట్లు నిర్ధారించారు. ఇద్దరిని ప్రత్యేక వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. అయితే ఇద్దరు వ్యక్తులకు మంకీ పాక్స్ సోకిన విషయాన్ని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధికారికంగా ప్రకటించారు. కాగా మంకీ పాక్స్ ఇప్పటికే ప్రపంచ దేశాలను వణికించింది. మొత్తం 122 దేశాల్లో 99, 518 మందికి మంకీ పాక్స్ సోకింది. ఈ మహమ్మారి ఆఫ్రికా దేశాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందింది. దీంతో అక్కడ ప్రభుత్వం గతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించింది. అయితే మంకీ పాక్స్ కేసులు భారత్‌లోనూ నమోదు అయ్యాయి. సెప్టెంబర్ 9న తొలి కేసు కేరళలో నమోదు అయింది. విదేశాల నుంచి వచ్చిన వ్యక్తికి మంకీ పాక్స్ సోకినట్లు సెప్టెంబర్ 18న కేరళ ప్రభుత్వం వెల్లడించింది. తాజాగా కూడా కేరళలోనే మంకీ పాక్స్ కేసు నమోదు కావడంతో అక్కడి ప్రజలు అందోళనలు చెందుతున్నారు.

# నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం

- ఆరేండ్ల బాలుడిలో వ్యాధి లక్షణాలు
- చెన్నై తరలింపు



నెల్లూరు

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురంలో జికా వైరస్ కలకలం రేపింది. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు ఆ ప్రాంతంలో పర్యటించారు. జికా వైరస్ అనుమానిత బాలుడిని మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు నుంచి చెన్నరుకు బుధవారం తరలించారు. రక్తనమూనాలు సేకరించి పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్టు వచ్చే వరకు జికా వైరసా? కాదా? అనేది చెప్పలేమని డిఎం అండ్ హెచ్ఓ పెంచలయ్య తెలిపారు. ఈ గ్రామానికి చెందిన పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం%ళా% వెంకటాపురం గ్రామానికి చెందిన బద్దల నాగరాజు, కల్యాణి దంపతుల ఆరు సంవత్సరాల కుమారుడు సుబ్బరాయుడు దుత్తలూరు ప్రయివేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడికి గతంలో అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండేది. ఇటీవల పది రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో, తల్లిదండ్రులు ఆ బాలుడిని నెల్లూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు వ్యాధి లక్షణాలను బట్టి జీకా వైరస్ సోకి ఉంటుందని అనుమానించారు. బాలుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, మంచి వైద్యమందిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలోని జ్వరపీడితులకు వైద్య బృందాలు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనతో ఉన్నారు. మలేరియా విభాగం స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్ఓ) అధికారి మౌనిక, పలువురు వైద్యులు గ్రామంలో పర్యటించారు. వైద్య బృందం సహాయంతో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో దోమల లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు వైద్య సిబ్బంది సూచించారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, కృష్ణపురం వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# సునీత విలియమ్స్ రాక మరింత ఆలస్యం..!





-హైదరాబాద్ : భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ రాక మరింత ఆలస్యం కానున్నది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది ఫిబ్రవరిలో భూమిపైకి చేరాల్సి ఉంది. అయితే, ప్రస్తుతం నాసా షెడ్యూల్‌ను సవరించింది. దాంతో ఆమె మరోనెల రోజుల పాటు ఇంటర్‌నేషనల్ స్పేస్ స్టేషన్‌లోనే నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురైంది. మార్చిలో తిరిగి భూమిపైకి చేరుకునే అవకాశాలున్నాయి. స్పేస్‌ఎక్స్ క్రూ-10 మిషన్‌లో ఆలస్యం నేపథ్యంలో ఆలస్యమవుతున్నట్లు నాసా పేర్కొంది. వారం రోజుల మిషన్ కోసం సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ జూన్‌లో బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ షిప్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. అయితే, సాంకేతిక కారణాలతో అక్కడే చిక్కుకుపోయారు. జూన్ 6న ఇద్దరూ వ్యోమగాములు ఐఎస్ఎస్‌లోకి వెళ్లగా.. అదే నెల 14న తిరిగి భూమిపైకి రావాలి. కానీ, స్టార్ లైనర్‌లో హీలియం లీకేజీ నేపథ్యంలో ప్రయాణం వాయిదా పడింది. ఆ తర్వాత స్టార్‌లైనర్ షిప్ వ్యోమగాములను ఐఎస్ఎస్‌లోనే వదిలి.. ఒంటరిగా తిరిగి భూమిపైకి చేరింది. ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన వ్యోమగాములను సురక్షితంగా భూమిపైకి తిరిగి తీసుకువచ్చేందుకు నాసా.. స్పేస్‌ఎక్స్ కూ-9ని సిద్ధం చేస్తున్నది. ఈ మిషన్ ఈ ఏడాది సెప్టెంబర్‌ను లాంచ్ చేసింది. క్రూ-9 అంతరిక్ష నౌకలో విలియమ్స్, విల్మోర్‌కు రెండు ఖాళీ సీట్లను ఖాళీగా ఉంచింది. క్రూ-9కి బదులుగా.. క్రూ-10లో తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. కొత్త స్పేస్‌క్రాఫ్ట్‌ని సిద్ధం చేసేందుకు స్పేస్‌ఎక్స్‌కు సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రయోగాన్ని మార్చి 2025కి వాయిదా వేసింది. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఎనిమిది రోజుల ప్రయాణం కాస్త తొమ్మిది నెలలపాటు ఐఎస్ఎస్‌లోనే ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇదిలా ఉండగా.. నాసా అడ్మినిస్ట్రేటర్ బిల్ నెల్సన్ మాట్లాడుతూ వ్యోమగాముల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ సందర్భంగా ఛాలెంజర్, కొలంబియా ఘటనలను గుర్తు చేశారు.

# అక్కడ మొబైల్ నెట్‌వర్క్ యమ స్పీడ్

- మొదటి స్థానంలో యూఏఈ
-తొలి మూడు స్థానాలూ గల్ఫ్‌వే
- టాప్ టెన్‌లో కనిపించని అమెరికా జపాన్, జర్మనీ
- 25వ స్థానంలో భారత్



న్యూఢిల్లీ

నేడు ప్రపంచంలో ఇంటర్నెట్ అనేది సామాన్యులకు అత్యంత ముఖ్యమైన అవసరాలలో ఒకటిగా నిలిచింది. ఇంటర్నెట్ సాయంతో ప్రజలు చౌకగా, సమర్ధవంతంగా విద్య, ఆరోగ్య రక్షణ, ప్రజా భద్రత, ప్రభుత్వ సేవలను పొందవచ్చు. ఆన్‌లైన్ బోధన, దూరవిద్య పొందాలనుకునే వారికి అందుబాటు ధరలోనే ఇంటర్నెట్ ఆ సదుపాయాలను కల్పిస్తోంది. అయితే ప్రపంచంలో అత్యంత వేగంగా మొబైల్ నెట్‌వర్క్‌ను కలిగిన దేశం ఏదో మీకు తెలుసా?
నవంబర్ నెలకు సంబంధించి స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్ అందజేసిన సమాచారం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అత్యంత వేగంగా మొబైల్ నెట్‌వర్క్‌ను అందిస్తున్న మొదటి 10 దేశాల జాబితాలో అమెరికా, జపాన్, భారత్, జర్మనీ వంటి ప్రధాన దేశాలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.
ఈ జాబితాలో ఐదు ఆసియా దేశాలకు చోటు దక్కింది. మొదటి మూడు స్థానాలూ గల్ఫ్ దేశాలవే. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 441.89 ఎంబీపీఎస్ (ఎంబీపీఎస్ అంటే సెకనుకు మెగాబిట్లు. మెగాబిట్ అనేది అతి చిన్న డేటా. డౌన్‌లోడ్ వేగాన్ని కొలవడానికి మెగాబిట్లు ఉపయోగపడతాయి. వీటి సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే ఇంటర్నెట్ ట్రాఫిక్ అంత వేగంగా ఉంటుంది) స్పీడ్‌తో మొదటి స్థానంలో నిలవగా ఖతార్ 358.27 ఎంబీపీఎస్‌తో రెండో స్థానంలో, కువైట్ 263.59 ఎంబీపీఎస్‌తో మూడో స్థానంలోనూ ఉన్నాయి.
స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్ అందించిన ముఖ్యమైన సమాచారాన్ని పరిశీలిస్తే%ళా%యూరో పియన్ యూనియన్ దేశమైన బల్గేరియా 172.49 ఎంబీపీఎస్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. 162.22 ఎంబీపీఎస్‌తో డెన్మార్క్ ఐదో స్థానంలో, 148.34 ఎంబీపీఎస్‌తో దక్షిణ కొరియా ఆరో స్థానంలో, 146.56 ఎంబీపీఎస్‌తో నెదర్లాండ్స్ ఏడో స్థానంలో, 145.74 ఎంబీపీఎస్‌తో నార్వే ఎనిమిదో స్థానంలో, 139.58 ఎంబీపీఎస్‌తో చైనా తొమ్మిదో స్థానంలో, 134.14 ఎంబీపీఎస్‌తో లక్సెంబర్గ్ పదో స్థానంలో నిలిచాయి. సింగపూర్ (127.75 ఎంబీపీఎస్), అమెరికా (124.61 ఎంబీపీఎస్), బ%ఎ%్రైన్ (118.36 ఎంబీపీఎస్), ఫిన్లాండ్ (114.45 ఎంబీపీఎస్) తర్వాతి స్థానాలను ఆక్రమించాయి.
జపాన్ 51.95 ఎంబీపీఎస్ మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్‌తో 59వ స్థానంలో నిలిచింది. 20.89 ఎంబీపీఎస్‌తో పాకిస్తాన్ 97వ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ 28.26 ఎంబీపీఎస్‌తో 88వ స్థానంలో నిలిచింది. కాగా మన దేశంలో మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ 100.78 ఎంబీపీఎస్. సూచికలో మన స్థానం 25. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ విషయానికి వస్తే మన దేశం నేపాల్ కంటే వెనుకబడి ఉంది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్ 63.55 ఎంబీపీఎస్‌తో భారత్ 91వ ర్యాంకులో ఉండగా 70.94 ఎంబీపీఎస్‌తో నేపాల్ 87వ స్థానంలో నిలిచింది.

# బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ వైపా?

(మొదటి తరువాయి)

చేపట్టింది. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు, జెండాలు పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్‌భవన్‌కు దగ్గర్లో ర్యాలీని పోలీసులు నిలుపుదల చేయడంతో సీఎంతో పాటు మంత్రులు, ఇతర నేతలు అక్కడే రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీ మీద నమోదైన కేసు గురించి స్పందించడం లేదని విమర్శించారు. "అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీకి లొంగిపోయింది. అందుకే అదానీపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత మాట్లాడటం లేదు. పార్లమెంట్‌లో వారి విధానమేంటో చెప్పాలి. మోడీ, కేసీఆర్ వేర్వేరు కాదు. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. వారికి చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసనసభలో చర్చకు అనుమతిస్తాం. జేపీసీ కోసం శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ వైపా? వెల్లడించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాల ముందు అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏండ్లు కష్టపడి అనేక జాతీయ సంస్థలను సృష్టిస్తే వాటిని మోడీ తన మిత్రులకు కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిందని అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఫారెన్ కరెప్షన్ యాక్ట్ ప్రకారం అదానీ సంస్థలపై కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయి. అక్రమ వ్యాపారాల కోసం ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయి. అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చకు, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోడీ యత్నిస్తున్నారు. అదానీకి అమెరికా జైలా? తీహార్ జైలా? అనేది మోడీ నిర్ణయించాలి. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం" అని సీఎం రేవంత్ హెచ్చరించారు. "సడక్‌సే సంసద్ తక్ గాంధీనే హమ్‌కో లడ్‌నే సిఖాయా" మేం గాంధీ వారసులం. అదానీ అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకునే వరకు పోరాడుతామని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గత కొంతకాలంగా అల్లర్లతో అట్టుడికిపోతున్న మణిపూర్‌ను ప్రధాని సందర్శించి శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అమిత్ షా క్షమాపణ చెప్పాలి

(మొదటి తరువాయి)

రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. బుధవారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీలు అంబేద్కర్ చిత్రపటాలతో ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్, డిఎంకె, ఎన్‌సిపి, సిపిఎం, ఆర్‌జెడి, ఎస్‌పి, ఆప్, జెఎంఎం, ఐయుఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్, సిపిఐ, ఆర్‌ఎస్‌పి తదితర పార్టీల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ, టిఆర్ బాలు (డిఎంకె), జాన్ బ్రిట్టాస్, వి శివదాసన్ (సిపిఎం), సంజరు సింగ్ (ఆప్), మనోజ్ కుమార్ ఝూ (ఆర్‌జెడి), మహువా మొంయిత్రా (జెఎంఎం) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాజ్యసభలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అని, ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించడాన్ని దేశం సహించదని అన్నారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరు ప్రస్తావించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తారని, కోట్లాది మంది దళితులు, అణగారిన వర్గాల ప్రజల ఆత్మగౌరవానికి ఆయన ప్రతీక అని అన్నారు.

**అట్టుడికిన ఉభయ సభలు**

అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు అట్టుడికాయి. లోక్‌సభ ప్రారంభమైన రెండు నిమిషాలకే మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను వెంటనే గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో కూడా ఇదే తంతు నడిచింది. ప్రతిపక్షాల ఆందోళనతో ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే రాజ్యసభ గురువారానికి వాయిదా పడింది. అమిత్ షాపై టిఎంసి ఎంపి డెరెక్ ఓబ్రియన్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చారు.

**అమిత్ షా.. దేశానికి క్షమాపణ చెప్పాలి : ఖర్గే**

అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదని, వారు మనుస్మృతి గురించి మాట్లాడుతుంటారని విమర్శించారు. అమిత్ షాకు మద్దతుగా ప్రధాని మోడీ ఆరు పోస్టులు పెట్టారని, అంత అవసరం ఏముందని ప్రశ్నించారు. ఎవరైనా అంబేద్కర్ గురించి తప్పుగా మాట్లాడితే, అలాంటి వ్యక్తిని కేబినెట్ నుంచి తొలగించాలని, కానీ వారిద్దరూ స్నేహితులు కనుక ఒకరి పాపాలకు మరొకరు మద్దతు ఇస్తున్నారని విమర్శించారు. అమిత్ షా దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలను తమిళనాడు, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకె స్టాలిన్, మమతా బెనర్జీ, బిఎస్‌పి అధినేత్రి మాయావతి ఖండించారు.

**నా వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది : అమిత్ షా**

తన వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. రాజ్యసభలో రాజ్యాంగంపై మంగళవారం చర్చ జరుగుతున్న సమయంలో అమిత్‌షా మాట్లాడుతూ 'అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని చెప్పడం ఫ్యాషన్‌గా మారింది. ఇన్నిసార్లు దేవుడి పేరు చెప్పివుంటే వారికి స్వర్గంలో అయినా స్థానం లభిస్తుందని' కాంగ్రెస్‌నేతల్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం కావడంతో బిజెపి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అమిత్‌షా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌కు వ్యతిరేకమని అన్నారు. అమిత్ షాకు మద్దతుగా ప్రధాని మోడీ వరుసగా ఆరు ట్వీట్లు చేశారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాలను కించపరచడానికి ఒక రాజవంశం నేతృత్వంలోని పార్టీ డర్టీ ట్రిక్స్‌కు పాల్పడుతోందంటూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు.

# భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత

(మొదటి తరువాయి)

ప్రతి రైతుకూ భూధార్ కోడ్ కేటాయిస్తామని ప్రకటించారు. సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. పార్ట్-బి భూముల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికీ ఒక అధికారిని నియమిస్తామని ప్రకటించారు. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణి పోర్టల్లో లక్షల సమస్యలు వచ్చాయని, వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 10,900 గ్రామాల్లోని రెవెన్యూ వ్యవస్థను ఒక్క కలం పోటుతో కుప్పకూల్చారని విమర్శించారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాల దాకా వెళ్లిందని చెప్పారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు ధరణి పరిస్థితి తయారైందని అన్నారు. గత పాలకులు తెచ్చిన ఈ లోప భూయిష్ట చట్టం వల్ల భూ యజమానికి తెలియ కుండానే చేతులు దాటి కాళ్ల కింద నేల కదిలిపోయిందని విమర్శించారు.

బుధవారం అసెంబ్లీలో భూభారతి బిల్లును సభ ముందు పెట్టారు. అందులోని కీలకాంశాలను వివరించారు. లోపభూయిష్టంగా ఆర్‌ఓఆర్ చట్టం-2020 ఉందనీ, దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. దాని ద్వారా బాధితులు తమ సమస్యలు చెప్పుకున్నా.. పరిష్కారం చేసే మార్గం లేకుండా పోయిందన్నారు. లోపాల కారణంగా నాలుగు నెలలుగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. 18 లక్షలా 26వేల ఎకరాలు పార్ట్ బీలో ఉన్నాయని, ఏ కారణం చేత ఈ భూమిని పార్ట్-బీలో పెట్టారనేది తెలియడం లేదని అన్నారు. ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ చట్టాన్ని రూపొందించామని స్పష్టం చేశారు. కొత్త చట్టం రూపకల్పనకు 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ చట్టాలను కమిటీ అధ్యయనం చేసిందనీ, చట్టం ముసాయిదాను 45 రోజుల పాటు పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని చెప్పారు. ఎక్కడా భేషజాలకు పోకుండా మేధావులు, రెవెన్యూ నిపుణులతో పాటు హరీశ్‌రావు, వినోద్‌కుమార్, పలు రాజకీయ పార్టీల నేతలు ఇచ్చిన మంచి సలహాలను కూడా స్వీకరించామన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో తిరుమలగిరి మండలాలను ఎంపిక చేసి విస్తృతస్థాయిలో చర్చలు జరిపామన్నారు. ధరణి పోర్టల్‌లోని ఏవైనా మంచి విషయాలుంటే తీసుకుంటామనీ, ఎలాంటి భేషజాలకు వెళ్లబోమన్నారు. ఇప్పటి వరకు 22,23 సార్లు డ్రాఫ్టులు మార్చి బిల్లును ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

ప్రత్యేక కమిటీ 33 జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు. పాసు బుక్కుల్లో ఉన్న భూములకు, పొజిషన్‌లో ఉన్న భూములకు తేడా కనుక్కోవడానికి చట్టంలో నిబంధనలు రూపొందించా మన్నారు. గ్రామ కంఠం, ఆబాదీ భూములకు పరిష్కారాలు ఈ కొత్త చట్టంలో ఉన్నాయ న్నారు. పొజిషన్‌కు, పాసుబుక్కులో ఉన్న భూ విస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేసేందుకు సర్వే నిర్వహిస్తామన్నారు. మ్యుటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో ఆధ్వర్యంలో అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వారసత్వ ఆస్తుల అభ్యంతరాలపై అప్పిలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రాస్ చెక్ చేసి మ్యూటేషన్ చేసే అధికారం ఆర్డీవోకి కొత్త చట్టంలో కల్పిస్తుందన్నారు. సభ్యుల నుంచి మంచి సూచనలు వస్తే ఈ బిల్లులో చేర్చడానికి తమకు ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఎమ్మార్వో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు.

ఆర్డీఓ, కలెక్టర్ అప్పీల్ అథారిటీగా ఉంటారన్నారు. ఆ తర్వాత అప్పీల్ చేసుకోవడానికి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ దేశంలో భూ సంస్కరణలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. సాదా బైనామాల కింద 9.24 లక్షల దరఖాస్తులొచ్చాయనీ, వాటికింద అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలుపుకునే అవకాశం చట్టంలో కల్పించామని వివరించారు. ప్రతి ఏడాదీ జమా బందీ కార్యక్రమం నిర్వహించేలా చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేలా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్‌ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్‌ను ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపర్చిందన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని తారుమారు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునేలా నిబంధనలు పొందుపర్చామని వివరిం చారు. భూభారతితో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతా భావానికి గురి కావాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు.

# నివాసమున్న గృహాలను హైడ్రా కూల్చదు

(మొదటి తరువాయి)

ఉంటే మాత్రం కూల్చేస్తామని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువులు, పార్కులతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇలాంటి సంస్థ దేశంలోనే మొట్ట మొదటిదని చెప్పారు. బుధవారం హైడ్రా ప్రధాన కార్యాయంలో ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ప్రయోజనాలను, ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు ఈ ఏడాది జులై నాటికి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే కూల్చబోమన్నారు. అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం (ఉదాహరణకు ఎన్ కన్వెన్షన్) ఎప్పుడూ కట్టినా ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తామన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి, తరువాత రద్దు చేస్తే ఆ కట్టడాలు అక్రమ కట్టడాలే అవుతాయని, అవి నివాసాలు అయినా సరేనని, జులై తరువాత నిర్మాణం జరుగుతుంటే వాటిని అక్రమ కట్టడాలుగా పరిగణించి కూల్చుతామని చెప్పారు. అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా బాధ్యులను చేస్తామన్నారు. కత్వా చెరువు, మల్లంపేటలో, అమీన్‌పూర్‌లో కూల్చివేతలు ఈ కేటగిరీలోకి వస్తాయని స్పష్టం చేశారు. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, అలాంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలేనని చెప్పారు.

# కోర్టు తలుపులు తెరిచే వుంటాయి

(మొదటి తరువాయి)

నేరుగా రావచ్చని లేదా వారి ప్రతినిధులను పంపవచ్చని బుధవారం తెలిపింది. ఇందులో ఇమిడివున్న అన్ని పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూనే సమస్యలను కోర్టు పరిశీలిస్తుందని జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. ఖానౌరి సరిహద్దు వద్ద నిరవధిక నిరశన జరుపుతున్న రైతు నేత జగ్‌జిత్‌సింగ్ దలెవాల్‌తో వరుసగా చర్చలు జరుపుతున్నామని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. గత 20 రోజులుగా నిరవధిక దీక్ష జరుపుతున్న దలెవాల్ ఆరోగ్య పరిస్థితిపై సుప్రీం ఆందోళన వ్యక్తం చేసింది. అవసరమైన వైద్య సాయం అందజేయాల్సిందిగా పంజాబ్ ప్రభుత్వాన్ని కోరింది. తాము ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీతో చర్చలు జరిపేందుకు రైతులు నిరాకరిస్తున్నారని పేర్కొంది. దీనిపై తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

# జమిలి బిల్లుపై 31 మందితో జెపిసి

(మొదటి తరువాయి)

చట్టాలను సవరిస్తూ ఈ బిల్లు తీసుకొచ్చారు. ఈ కమిటీలో కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, నూతనంగా ఎన్నికైన ప్రియాంకగాంధీసహా 21 మంది లోక్‌సభ సభ్యులకు, మరో 10 మంది రాజ్యసభ సభ్యులకు స్థానం కల్పించారు. లోక్‌సభ నుంచి కమిటీలో ఉండబోయే 21 మంది సభ్యులలో 10 మంది బిజెపికి చెందిన వారు, ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, శివసేన (షిండే), ఆర్‌ఎల్‌డిలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు, ఎస్‌సిపి, టిఎంసి, డిఎంకె, ఎన్‌సిపికి చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. బిజెపి నుంచి పిపి చౌదరి, సిఎం రమేష్, బాన్సూరి స్వరాజ్, పురుషోత్తం రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాళ్ రామ్, భర్తృహరి మహతాబ్, సంబిత్ పాత్ర, అనిల్ బలుని, విష్ణు దత్ శర్మ ఉన్నారు. జిఎం హరీష్ బాలయోగి (టిడిపి), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన షిండే), చందన్ చౌహాన్ (ఆర్‌ఎల్‌డి), వల్లభనేని బాలశౌరి (జనసేన) ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేయో భగత్ ఉన్నారు. ధర్మేంద్ర యాదవ్ (ఎస్‌పి), కల్యాణ్ బెనర్జీ (టిఎంసి), టిఎం సెల్వగణపతి (డిఎంకె), సుప్రియా సూలే (ఎన్‌సిపి) ఉన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా ఉండబోయే మరో పది మంది పేర్లను రాజ్యసభలో ప్రకటించనున్నారు.

# మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం..

(మొదటి తరువాయి)

చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన విలేకరులతో అన్నారు. 'వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పిటిఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం' అని అన్నారు.

# డ్రంకెన్ డ్రైవ్‌తో అసెంబ్లీ హీట్

(మొదటి తరువాయి)

సభను హీటెక్కించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారిస్తున్నా తగ్గేదే లేదన్నట్టు కోమటిరెడ్డి మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయొద్దు అన్నా.. హరీశ్‌రావు, కోమటిరెడ్డిలిద్దరూ మాటకు మాట అనుకుంటూ అనవసర చర్చకు దారితీశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసుకున్నారు. చివరకు వారిద్దరికీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సర్దిచెప్పారు. 'సభను సజావుగా సాగేలా చూడండి. ఇద్దరు సభ్యులు చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని సభలో సభ్యులు మదన్‌మోహన్‌రావు, పాల్వాయి హరీశ్‌బాబు, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిస్తూ పదేండ్ల కాలంలో తెలంగాణలో రోడ్ల విధ్వంసం జరిగిందన్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చలేదని విమర్శించారు. ఉప్పల్-ఘట్‌కేసర్ రోడ్డు ఏడేండ్లుగా పూర్తిగాక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

# సంపాదకీయం

## ప్రపంచం మీద డాలర్ పెత్తనం

అంతర్జాతీయ ఆర్థిక, ద్రవ్య వ్యవస్థ ద్వారా అన్ని దేశాలకూ సౌకర్యంగా ఉండే ఒక చెల్లింపుల విధానాన్ని రూపొందించుకుని ఆ ప్రాతిపదికన వాణిజ్యాన్ని కొనసాగించవచ్చని కొంత మంది ఆర్థికవేత్తలు భావిస్తారు. కాని వాస్తవం అందుకు పూర్తి భిన్నం. పశ్చిమ సామ్రాజ్యవాద దేశాల పెత్తనం మీద ఆధారపడి అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడింది. ఈ ఆర్థిక, ద్రవ్యవ్యవస్థ తిరిగి అదే సామ్రాజ్యవాదానికి అండగా నిలబడుతుంది. ఈ అంతర్జాతీయ వ్యవస్థకు ఇరుసు అమెరికన్ డాలర్. ఐతే, అంతర్జాతీయ వాణిజ్యంలో పాల్గొనే వివిధ దేశాల మధ్య పరస్పరం జరిగే వాణిజ్యానికి ఈ డాలర్ పెత్తనం ప్రతిబంధకంగా ఉంటోంది. ఉదాహరణకు, 1వ దేశానికి 'క' అనే సరుకు అవసరం అనుకోండి. అది 2వ దేశం తయారు చేస్తోంది. ఈ 2వ దేశానికి 'చ' అనే సరుకు అవసరం అనుకోండి. దాన్ని 1వ దేశం తయారు చేస్తోంది. అప్పుడు ఈ రెండుదేశాలూ ఆ రెండు సరుకులనూ పరస్పరం మార్పిడి చేసుకోవచ్చు కదా. కాని ప్రస్తుత అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థ ప్రకారం అలా మార్పిడి చేసుకోడానికి వీల్లేదు. ఆ రెండు దేశాల వద్దా తమకు కావలసిన సరుకులను కొనుగోలు చేయడానికి సరిపడా డాలర్ నిల్వలు ఉండాలి. అలా లేకపోతే ఆ రెండు దేశాలూ తమ సరుకులను మార్పిడి చేసుకోలేవు. అంతర్జాతీయ వ్యాపారం యావత్తూ డాలర్ కరెన్సీతోనే సాగుతుంది. ఈ నిబంధన గనుక లేకపోతే చాలా దేశాలు తమ తమ సరుకులను తక్కిన దేశాలతో తేలికగా మార్చు కోవచ్చు. డాలర్ మీద ఆధారపడడం అనేది తగ్గితే అది అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేస్తుంది. విధంగా డాలర్ మీద ఆధారపడటం తగ్గితే అది అమెరికాకు అంగీకారంగా ఉండదు. ప్రపంచమంతా డాలర్‌ను మారకపు సాధనంగా అంగీకరించడం, డాలర్ రూపంలో నిల్వఉంటే అది బంగారపు నిల్వతో సమానం అన్న అభిప్రాయం ప్రబలంగా ఉండడం అనేది అమెరికాకు చాలా పైచేయిని కల్పిస్తుంది. అమెరికా ఇప్పుడు ఎన్నటికీ తరగని ఒక బంగారపు గని మీద దర్జాగా కూర్చుని వుంది. ఇతర దేశాలనుండి తనకు కావలసిన వనరులను అది కొనుగోలు చేయవచ్చు, సంస్థలనే కొనుగోలు చేయవచ్చు, విదేశాలలో ఎంత కావాలంటే అంత పెట్టుబడి పెట్టవచ్చు. తన విదేశీ వ్యాపారంలో లోటుగనుక ఏర్పడితే దానిని పూడ్చుకోడానికి ఎన్ని డాలర్లు కావాలంటే అన్నింటిని ముద్రించుకోవచ్చు. అలా అపరిమితమైన కొనుగోలు శక్తిని అంతర్జాతీయ వాణిజ్య రంగంలో కలిగివుండడమే కాదు. ఇతర దేశాల మెడలు వంచి అవి తన పెత్తనానికి లోబడి వుండేలా చేయడానికి కూడా డాలర్ పెత్తనం తోడ్పడుతుంది. ఆ యా దేశాల డాలర్ నిల్వలు సాధారణంగా పశ్చిమ దేశాల బ్యాంకుల్లోనే భద్రపరచడం జరుగుతుంది. అందుచేత అమెరికా తనకు నచ్చిన దేశానికి కావలసినంత మేరకు డాలర్ల ప్రవాహాన్ని పంపనూవచ్చు. తనకు నచ్చనప్పుడు ఆ దేశపు బ్యాంక్ అకౌంట్లను స్తంభింపజేసి డాలర్ల కొరతనూ సృష్టించవచ్చు. ఇరాన్ నుండి రష్యా వరకూ అనేక దేశాలు ఈ విధంగా శిక్షలు అనుభవిస్తున్నాయి. ఈ విధంగా వివిధ దేశాల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం ఈ మధ్య కాలంలో మరీ ఎక్కువైంది. దాంతో డాలర్ ప్రమేయంలేని వ్యాపారం కావాలన్న డిమాండ్ ఆ డాలర్ల కొరతను ఎదుర్కొంటున్న దేశాల నుండి పెరుగుతోంది. ప్రస్తుతం దాదాపు మూడోవంతు ప్రపంచ దేశాలు అమెరికా నుండి ఇటువంటి శిక్షలను ఎదుర్కొం టున్నాయి. అయితే ఆ విధంగా శిక్షించడానికి ఐరాస నుండి అమెరికాకు ఎటువంటి అనుమతీ లేదు. దక్షిణాఫ్రికా దేశం జాతి వివక్షతను పాటించిన కాలంలో అంతర్జాతీయ సమాజం ఆదేశాన్ని శిక్షించడానికి ఆమోదం ఇచ్చింది. అటువంటి సందర్భాలేవీ లేకపోయినా అమెరికా తన పెత్తనాన్ని చెలాయిస్తూ తనకు లొంగని దేశాల ఖాతాలను స్తంభింపజేస్తూ వాటిని ఇబ్బందులపాలు చేస్తోంది. వాటిలో మూడవ ప్రపంచ దేశాలు ఎక్కువగా ఉన్నాయి. అమెరికా కన్నెర్రకు గురైన దేశాలు ఇప్పుడు డాలర్ ప్రమేయం లేని అంతర్జాతీయ వాణిజ్యం కావాలని కోరుకుంటున్నాయి. ఇటీవల కజన్‌లో జరిగిన 'బ్రిక్స్' దేశాల శిఖరాగ్ర సమావేశంలో ఈ ఆకాంక్ష బలంగా వ్యక్తమైంది. మ పెత్తనం వల్లే ఇటువంటి ఆకాంక్షలు తలెత్తుతున్నాయని అమెరికన్ ప్రభుత్వం సైతం గుర్తించింది. అమెరికన్ ఆర్థిక శాఖ మంత్రి జేనెట్ యె÷-లలెన్ జులైలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 'అమెరికా ఆంక్షలు ఎన్ని ఎక్కువ దేశాల మీద విధిస్తే అన్ని ఎక్కువ దేశాలు అమెరికన్ డాలర్ ప్రమేయం లేని వ్యాపారం కావాలని కోరుకుం టాయి.' అన్నారు. తన అడుగులకు మడుగులొత్తేలా ఒత్తిడి చేయడానికి అమెరికా ఆంక్షల బెదిరింపును వాడుకుంటోందని యె÷-లలెన్ చెప్పకనే చెప్పారు. అలా బెదిరింపులలకు బలౌతున్న దేశాల సంఖ్య పెరుగుతున్న సంగతినీ అంగీకరించారు. అలా ఏకపక్షంగా ఆంక్షలు విధించడం ద్వారా పెత్తనాన్ని చెలాయిం చేందుకు పూనుకోవడం వలన పరస్పర విరుద్ధ ఫలితాలు వస్తాయి. ఒకటో, రెండో దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు వాటి ప్రభావమూ గట్టిగా ఉంటుంది, ఆ ఆంక్షలు మొత్తం వ్యవస్థకూ ముప్పు తెచ్చిపెట్టవు. అదే అనేక దేశాల మీద ఆంక్షలు విధిస్తే అప్పుడు మొత్తం వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా పేదరికంలోకి దిగజారిపోతున్న దేశాల సంఖ్య పెరుగుతోంది. అందుచేత ఎదురు తిరిగే దేశాల సంఖ్య రానున్న కాలంలో ఇంకా పెరిగే అవకాశా లున్నాయి. వాటి మీద ఆంక్షలూ పెరుగుతాయి. అప్పుడు ఈ డాలర్ పెత్తనమే వద్దనే దేశాల సంఖ్యా పెరుగుతుంది. డాలర్‌ను అంతర్జాతీయ మారకపు సాధనంగా ఉపయోగించడం వలన అమెరికా దానిని అడ్డం పెట్టుకుని వివిధ దేశాల మెడలు వంచి వాటిపై తన పెత్తనాన్ని చెలాయించడం వల్లనే ఇలా జరుగుతోంది. అందుచేత డాలర్ మారకపు కరెన్సీగా ఉండడం అనేది అంతర్జాతీయ వాణిజ్యంలో అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉంటుందని ఉదారవాద ఆర్థికవేత్తలు చెప్తున్నది ఎంత డొల్ల వాదనో స్పష్టంగా తేలుతోంది. డాలర్ ఈ విధంగా పెత్తనం చెలాయించగలగడానికి ఒక కారణం 1970 దశకంలో అమెరికాకు, చమురు ఉత్పత్తి దేశాలకు నడుమ కుదిరిన ఒప్పందం. ఆ ఒప్పందాన్ని సౌదీ అరేబియా మధ్యవర్తిత్వంతో కుదుర్చుకున్నారు. దాని ప్రకారం అంతర్జాతీయంగా ముడిచమురు ధరలను డాలర్‌లనో నిర్ణయిస్తారు. ఆ డాలర్లలోనే ఆ చమురు వ్యాపారం సాగుతుంది. చమురుకు ఉన్న ప్రాధాన్యత రీత్యా ఈ ఒప్పందం తర్వాత డాలర్ ప్రాధాన్యత ఒక్కసారి పెరిగింది. ముడి చమురుకు ఇటువంటి ప్రాధాన్యత ఉంది కనుకనే ఇటీవల పశ్చిమ దేశాలు రష్యాపై ఆంక్షలు విధిం చాక వాటి నుండి తట్టుకోడానికి రష్యా తన ముడిచమురు కొనుగోలు చేసేవారు రూబుళ్లలోనే చెల్లింపులు చేయాలని నిబంధన విధించింది. అయితే, 1970 దశకంలో కుదిరిన ఆ ఒప్పందం ఒక్కటే డాలర్ ఆధిపత్యం నేటికీ కొనసాగడానికి కారణం కాబోదు. డాలర్ ప్రమేయం లేకుండా అంతర్జాతీయ వ్యాపారం జరగాలన్న భావననే జేనెట్ యె÷-లలెన్ మొదట్లో తేలికగా కొట్టిపారేశారు.

# విధానాలలో మరింత సాహసం కావాలి!

ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీలు బడ్జెట్ పరిమితులను దృష్టిలో ఉంచుకోకుండా గెలుపే లక్ష్యంగా అంతులేని హామీలు ఇవ్వడం, ప్రజలు వాటిని విశ్వసించి ఓట్లేస్తే, గెలిచి అధికారం చేపట్టాక వాటిని అరకొరగా అమలు చేయడం, కొన్ని హామీలనైతే అసలే పట్టించుకోకపోవడం గత నాలుగు దశాబ్దాలుగా ఆనవాయితీ కొనసాగుతున్నది గత నిరంకుశ పాలకులపై, వారి విధానాలపై, ఎన్నికల హామీల ఉల్లంఘనపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఎన్నో విమర్శలు చేశారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ భాషలో మాట్లాడితే, రేవంత్ కూడా అదే భాషలో సమాధానం చెప్పేవారు. తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనపై విముఖతతో ఉన్న సాధారణ ప్రజలు నాటి రేవంత్ దూకుడును, ఆయన భాషను హర్షించి ఉండవచ్చు. కానీ అధికారం చేపట్టాక కూడా రేవంత్ భాషలో పెద్దగా మార్పు లేదు. అదే దూకుడును కొనసాగిస్తున్నారు. ఇచ్చిన హామీల అమలులో గత ప్రభుత్వానికి భిన్నంగా వ్యవహరిస్తేనే ప్రజలు ఇలాంటి దూకుడును హర్షిస్తారు. లేదంటే విముఖత ప్రదర్శిస్తారు. "మూసీ పునరుజ్జీవనం లాంటి అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డొస్తే, ఎవరినైనా బుల్డోజర్‌లతో తొక్కేస్తాం" అని ఇటీవల ముఖ్యమంత్రి హెచ్చరించారు. నిజానికి ఈ బుల్డోజర్ భాష బీజేపీ నాయకులది. బుల్డోజర్ ఆచరణ కూడా బీజేపీ ప్రభుత్వాలదే. ఈ భాషను, చర్యలను ఇటీవల సుప్రీంకోర్టు తప్పుపట్టింది కూడా. రేవంత్ అదే భాషనూ, చర్యలనూ అరువు తెచ్చుకోవడం అంటే, బీజేపీ నిరంకుశ భావజాలాన్ని అరువు తెచ్చుకోవడమే. తెలంగాణలో ప్రజలు సంతోషంగా, సుభిక్షంగా ఉండాలనే రాజకీయ చిత్తశుద్ధి కాంగ్రెస్ పార్టీకీ, ముఖ్యమంత్రికీ ఉంటే ఈ బుల్డోజర్ భావజాలానికి గురికాకుండా కొన్ని రంగాలలో రొటీన్‌కు భిన్నంగా స్పష్టమైన విధానాలను రూపొందించాలి. వాటిని ధైర్యంగా ప్రకటించి అమలు చేసే సాహసాన్ని ప్రదర్శించాలి. ముఖ్యంగా ప్రజాస్వామిక పాలనా స్ఫూర్తికి భిన్నమైన పోకడలను ప్రభుత్వం సవరించుకోవాలి. దామగుండం, మూసీ, లగచర్ల, దిలావర్‌పూర్ లాంటి ఘటనలు ముందుకు వచ్చినప్పుడు ప్రభుత్వం వెంటనే ఆయా ప్రజల ఆందోళనలపై "రాజకీయ ప్రేరేపితం" అన్న ముద్ర వేయటం, పోలీసు బలగాలతో ఆ అసంతృప్తిని అణచివేయాలని చూడటం తగని పని. ప్రజలతో, ప్రజా సంఘాలతో, పౌర సమాజ ప్రతినిధులతో చర్చల ద్వారా, ప్రజల సమస్యల పరిష్కారానికి పూనుకోవాలి. ఆ ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళడానికి ఒక శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. తక్షణం ముందుకు వచ్చిన సమస్యను ఏదో ఒక హామీ ఇచ్చి మభ్యపెట్టి, కాలం దాటేయాలని చూడకుండా, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించడానికి చర్చలు కొనసాగించాలి. దిలావర్‌పూర్‌లో ప్రజల డిమాండ్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ




నిర్మాణాన్ని ఆపేసింది. కానీ మహిళలతో సహా, అక్కడ పోరాడిన ప్రజలపై అక్రమ కేసులు పెడుతున్నది. ఈ ధోరణి అక్కడి ప్రజలకు సరైన సూచనలు ఇవ్వదు. ప్రజా భవన్‌లో వారానికి రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ప్రజావాణిని మరింత బలోపేతం చేయాలి. గ్రామ, మండల, జిల్లా స్థాయి నుండీ ప్రజలు తమ నిత్య జీవిత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినప్పుడు వాటిని స్థానికంగానే వేగంగా పరిష్కరించే ప్రయత్నం చేయాలి. ఇందుకుగాను ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా పౌర సేవల చట్టాన్ని ఆమోదించి అమలు చేయాలి. ప్రజల ఫిర్యాదులకు రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ నంబర్‌ను వెంటనే ప్రారంభించాలి. రేవంత్‌రెడ్డి పాలన రెండవ సంవత్సరంలో ప్రవేశించింది. గతంలో హామీ ఇచ్చి అమలు చేయని అంశం ఒకటి ప్రజలకు ఇంకా జ్ఞాపకం ఉంది%-% అదే ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత. ఈ డిసెంబర్ 9 నుంచి మొదలైన అసెంబ్లీ సమావేశాలలో ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించి, వాటిని అమలు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్ కేటాయింపులు చేసి అమలు చేయాలి. అలాగే వివిధ వర్గాల శ్రేయస్సు దిశగా విస్పష్ట విధాన ప్రకటనలు చేయాల్సిన అంశాలు మరెన్నో ఉన్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో పేద మధ్యతరగతి ప్రజలకు, రైతులకు, కార్మికులకు, ముఖ్యంగా అసంఘటిత కార్మికులకు, దళితులకు, ఆదివాసీలకు, వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి బడ్జెట్ కేటాయింపులు చేసి అమలు చేయాలి. అందుకు అవసరమైన విధాన ప్రకటనలను ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాలలో చేయాలి. ప్రజలకు హామీ ఇచ్చిన విధంగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్, ముస్లిం డిక్లరేషన్‌ల అమలు ప్రారంభిస్తామని స్పష్టంగా ప్రకటించాలి. వ్యవసాయ రంగంలో సమగ్ర వ్యవసాయ విధానం, శాస్త్రీయ పంటల ప్రణాళిక, సేంద్రియ వ్యవసాయ విధానం రూపకల్పనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, 2025 ఖరీఫ్ నుండీ వాటిని అమలులోకి తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించాలి. వానాకాలం, యాసంగి సీజన్‌లలో కేవలం వరిని ప్రోత్సహించడం కాకుండా, పప్పు ధాన్యాలను, నూనె గింజలను, చిరు ధాన్యాలను, కూరగాయలను ప్రోత్సహిస్తామని, స్పష్టంగా అసెంబ్లీలో ప్రకటించాలి. ఎగుమతి ఆధారిత, సాగు నీరు ఎక్కువ అవసరమయ్యే పంటలను కాకుండా, రాష్ట్రానికి అవసరమయ్యే అన్ని పంటలను ప్రోత్సహిస్తామని కూడా ప్రభుత్వం ప్రకటన చేయాలి. బడ్జెట్‌లో విలువైన నిధులను, రాష్ట్రంలో ఖరీదైన నీళ్ళను ఉపయోగించి వరి లాంటి పంటలను పండించి, వాటిని ఎగుమతి చేయడం అర్థం లేని పనిగా ప్రభుత్వం గుర్తించాలి. ఒక సర్వే నంబర్‌లో ఎవరు సాగు చేస్తే వారికి మాత్రమే %-% అంటే నిజమైన సాగుదారులకు మాత్రమే ప్రభుత్వ పథకాల సాయం అందుతుందని, 2011 చట్టాన్ని అమలు చేసి, కౌలు రైతులను గుర్తిస్తామని, వారి వ్యవసాయానికి కూడా సహకారం అందిస్తామని స్పష్టంగా ఈ అసెంబ్లీ సమావేశాలలో విధాన ప్రకటన చేయాలి. ఇందుకోసం భూమి యజమానులు సహా, అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించడానికి ప్రభుత్వమే పూనుకుంటుందని కూడా ప్రకటించాలి రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అవసరమే కానీ, గత ప్రభుత్వం రాష్ట్రంలో కాలుష్యకారక ఫార్మా, ఇథనాల్, ఇతర పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తామని రవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో స్పష్టంగా ప్రకటించాలి. కేంద్రం అనుమతులు ఇచ్చినా సరే రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే అధికారాలను ఉపయోగించుకుని, తాము రాష్ట్రాన్ని, రాష్ట్ర పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రాధాన్యత ఇస్తామని కూడా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి స్పష్టం చేయాలి. దళితుల, వెనుకబడిన వర్గాల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను, రైతుల చేతుల్లో ఉన్న ఇతర భూములను అభివృద్ధి పేరుతో, పరిశ్రమల పేరుతో, భూసేకరణ, ల్యాండ్ పూలింగ్ పేరుతో లాక్కోబోమని కూడా ఈ అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. పరిశ్రమల ఏర్పాటు కోసం, ఇతర అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూమి అవసరమైనప్పుడు, భూమి సేకరణ పేరుతో రైతుల నుంచి తక్కువ పరిహారం చెల్లించి భూమి గుంజుకోవడం ఆపాలి. ఆయా పారిశ్రామికవేత్తలను, పరిశ్రమకు అవసరమైన భూములను, రైతుల నుండీ మార్కెట్ ధరకు నేరుగా కొనుక్కోమని ప్రోత్సహించాలి. లేదా పరిశ్రమల ఏర్పాటుకు భూమి అవసరమైన మేరకు రైతులను ఒప్పించి భూమిని లీజుకు తీసుకోమని ఆయా పరిశ్రమల యాజమానులను ప్రోత్సహించాలి.

# జమిలి దిశగా...!

నిన్నటిదా, మొన్నటిదా...దశాబ్దం నాటి కల, ఇప్పుడు నిజం చేసుకొనే ప్రయత్నంలో తొలి అడుగుపడింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన జమిలి బిల్లు పార్లమెంటులో ప్రవేశించింది. బిల్లు సభముందుకు రాగానే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ ఇత్యాది విపక్షాలు తాడెత్తున లేవడం, అరుపులూ కేకలతో నిరసనలు తెలియచేయడం అనూహ్యామైనవేమీ కావు. ఎంతోకాలంగా తమను వెంట తరుముతున్న ఈ ఒకేదేశం%-%ఒకే ఎన్నిక బిల్లు ఏదో ఒకరోజు కచ్చితంగా తమముందుకు రావడం ఖాయమని వారికీ తెలుసు. జమిలి బిల్లుల ప్రవేశాన్ని అనుమతిస్తూ 269మందే ఓటుచేయడం విపక్షానికి ఎందుకో అధికారపక్షం బలహీనతగా కనిపిస్తున్నది. బీజేపీ బలం, బలగం లెక్కలు అటుంచితే, బిల్లు ప్రవేశం దశలో మూడింట రెండువంతుల బలం అక్కరలేదన్న విషయం తెలియనిదేమీ కాదు. అధికారంలో ఎవరున్నా తాము చెబుతున్నదీ చేస్తున్నదీ ప్రజాప్రయోజనార్థమేనని అంటారు. తయారవుతున్న చట్టాలు దేశ సంక్షేమం కోసమే తప్ప తమ స్వార్థరాజకీయం కాదంటాయి. ఒకేదేశం%-%ఒకే ఎన్నిక ఆలోచనలో విపక్షాలకు ఒక బలమైన రాజకీయ కుట్ర కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమనీ, నియంతృత్వానికి దారితీస్తుందని, రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయనీ, ప్రాంతీయపార్టీలు ఉనికికోల్పోతాయనీ విపక్షాలు అంటున్నాయి. విపక్షాలు ప్రతీదానినీ రాజకీయకోణంలోనే చూస్తాయనీ, మోదీ భయం వాటిని కుదిపేస్తున్నదని అధికారపక్షం అంటోంది. రెండు బిల్లులనూ అడ్డుకోవడానికి ఆఖరుక్షణం వరకూ విపక్షాలు ప్రయత్నిస్తాయనీ, జేపీసీకి పంపాలని ఎలాగూ డిమాండ్ చేస్తాయనీ తెలుసు కనుక,




మంత్రివర్గ సమావేశంలోనే మోదీ జేపీసీ సూచన చేశారని అమిత్ షా ముందే తేల్చేశారు. సదరు కమిటీలో బీజేపీ సంఖ్యాబలం సహజంగానే ఎక్కువ ఉంటుంది కనుక, మిగతాదశలూ కష్టనష్టాలమాట అటుంచితే, ఈ దశ దాటడం ఖాయం. జమిలిని మ్యానిఫెస్టోలో పెట్టడం నుంచి, ఎర్రకోట ప్రసంగాలు, రాష్ట్రపతుల హితవులు, పార్టీపెద్దల అసందర్భోచిత ప్రస్తావనలు చాలా చూశాం. జమిలికి వకాల్తాపుచ్చుకున్న మాజీ రాష్ట్రపతి తన నివేదికలో దానిని ఓ చారిత్రాత్మక పరిణామంగా ముందుకు తోయడంలో ఆశ్చర్యమేమీ లేదు. జమిలికిపోతే జీడీపీ ఒకటిన్నరశాతం పెరుగుతుందన్న లెక్క ఆర్థికవేత్తలకు ఇంకా అర్థంకావాల్సి ఉంది. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, సునాయాస పాలనకు వీలుకలుగుతుందనీ పాలకపక్షం నేతల మాదిరిగానే ఈ కమిటీ కూడా చాలా చెప్పింది. ప్రతీ చిన్న ఎన్నికనూ ఓ యుద్ధంలాగా చేయడం బీజేపీ వచ్చిన తరువాతే పెరిగింది కానీ, అంతకుముందు ఎక్కడో ఎన్నికలు జరుగుతూంటే ఢిల్లీ ఏలికలు పెద్దగా ఆయాసపడిందేమీ లేదు. మంచిచెడులతో నిమిత్తం లేకుండా విపక్షాలన్నీ జమిలిని వ్యతిరేకించడానికి అసలు కారణం ప్రాంతీయ ప్రాధాన్యతలు వెనక్కుపోయి, జాతీయాంశాలు ముందుకు వస్తాయని, కేంద్రం బలపడుతుందని. ఎన్నికలవేళ మతాన్ని రగిలించి, దేశభక్తిని రంగరించి, సర్జికల్ దాడులతో మోదీ ఓట్లు ఎగరేసుకుపోతారని. రాజ్యాంగ సవరణ బిల్లు అయినప్పటికీ కూడా సభాప్రవేశం దశలో మూడింట రెండువంతుల మెజారిటీ అవసరం లేదని విపక్షాలకు తెలియదనుకోలేం. ఈ దశలోనే అధికారపక్ష కూటమి బలం తుస్సుమని తేలిపోయిందనీ, రేపు కచ్చితంగా జమిలి ఓడిపోతుందని నిజంగానే అవి నమ్ముతున్నపక్షంలో ఇప్పుడే అంత ఆవేశపడనక్కరలేదు. ఏ దశలో ఏ అడుగువేయాలో, ఎవరిని మోహరించి గట్టెక్కాలో అధికారపక్షానికి తెలిసిన విద్య కనుక తిమ్మినిబమ్మిని చేయగలదన్న భయం విపక్షాలకు లోలోన ఉన్నదేమో. బిల్లు నెగ్గదు అని విపక్షాలు అనడం, నెగ్గించి తీరుతామని అధికారపక్షం వాదించడం వాటి స్థానాల రీత్యా సహజం. గత రెండుపర్యాయాలు సొంతబలంతో అధికారంలో ఉన్న బీజేపీ, ఇప్పుడు మిత్రపక్షాల చేయూతలేనిదే అడుగువేయలేని దశలో రాజ్యాంగసవరణలకు అవసరమైనంత సంఖ్యాబలాన్ని కూడగట్టగలనన్న నమ్మకం?తోనే ఈ సాహసానికి పూనుకుందా? అన్నది ప్రశ్న. పదేళ్ళపాటు అవధులు దాటిన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించిన ఒక పార్టీకి, మూడోవిడతలో మరొకరి ఊనికతో నడవాల్సిరావడం భరించలేని విషయం. ఉన్న ఆ కాస్త హవా ఇంకొంత హరించుకుపోకముందే, జమిలితో దేశాన్నంతా చాపచుట్టేయాలని ఆశించడంలో తప్పేమీ లేదు. బలం లేనంతమాత్రాన సంకల్పం సన్నగిల్లలేదనీ, ఆత్మవిశ్వాసం చెదరలేదనీ, వెనక్కుతగ్గేదే లేదని దూకుడు చూపడం రాజకీయాల్లో అత్యంత ముఖ్యం.

# రెవెన్యూకు కొత్త రూపు

- పట్టాలెక్కనున్న కొత్త చట్టం
- నేడు సభలో ఆర్వోఆర్-2024 బిల్లు
- భూ సమస్యలపై అప్పీళ్లకు అవకాశం
- పరిష్కారానికి ల్యాండ్ ట్రైబ్యునళ్లు
- ప్రతి భూ కమతానికి భూధార్
- గ్రామ కంఠంలోని స్థలాలకు హక్కులు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ**
భూ సమస్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం తీసుకువస్తోంది. భూ దస్త్రాలు, యాజమాన్య హక్కుల చట్టం-2024 పేరుతో బుధవారం శాసనసభలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్వోఆర్-2020ను రద్దు చేయనున్నారు. పట్టా భూముల యజమానుల హక్కుల సంరక్షణతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు కూడా కొత్త చట్టంలో భద్రతాపరమైన సెక్షన్లను ఏర్పాటు చేశారు. ధరణి పోర్టల్ పేరును కూడా భూమాతగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**పాత సమస్యలకు పాతర**
ఏకకాల రిజిస్ట్రేషన్- మ్యుటేషన్ సేవల పేరుతో 2020లో భారాస ప్రభుత్వం తెలంగాణ పట్టా పాసుపుస్తకాలు, భూ దస్త్రాల చట్టం, ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో అనేక సమస్యలు తలెత్తడంతో ప్రభుత్వం కొత్త చట్టాన్ని ప్రవేశపెడుతోంది. భూ సమస్యలను తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలోనే పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తోంది. డివిజన్, జిల్లా, రాష్ట్రస్థాయిలో ల్యాండ్ ట్రైబ్యునళ్లను కూడా ఏర్పాటు చేయనున్నారు.

**ధరణి కమిటీ.. ప్రజాభిప్రాయ సేకరణ**
రాష్ట్రంలో భూ సమస్యలపై అధ్యయనానికి ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 9న ఐదుగురు సభ్యులతో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది.కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, మాజీ ఐఏఎస్ రేమండ్ పీటర్, న్యాయనిపుణుడు భూమి సునీల్‌కుమార్,విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బి.మధుసూదన్‌లతోపాటు సీసీఎల్ఏలతో ఏర్పాటు చేసిన కమిటీ పలు దఫాలు చర్చలు నిర్వహించింది.రైతులు, నిపుణులు, రెవెన్యూ సంఘాలు, వక్ఫ్,దేవాదాయ, అటవీశాఖల అధికారులతో సమావేశమైంది. ప్రయోగాత్మకంగా రంగారెడ్డి జిల్లాలో పర్యటించి సమస్యలను అధ్యయనం చేసింది.అనంతరం ప్రభుత్వానికి పలు సూచనలతో నివేదిక సమర్పించింది. కమిటీ సూచనల మేరకు ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా యాచారం, నల్గొండ జిల్లా తిరుమలగిరి మండలాల్లో పైలట్ సర్వేను చేపట్టి కీలక సమస్యలను గుర్తించింది. అనంతరం రాష్ట్రానికి అవసరమైన ఆర్వోఆర్ చట్ట రూపకల్పన బాధ్యతను నిపుణులకు అప్పగించింది.

**కొత్త చట్టంలోని కొన్ని కీలకాంశాలు**
అప్పీళ్లకు 60 రోజులు: భూ దస్త్రాల్లో అభ్యంతరాలకు సంబంధించి.. తహసీల్దారు జారీ చేసే ఉత్తర్వులపై ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవడానికి 60 రోజుల సమయం,ఆర్డీవో ఇచ్చే ఉత్తర్వులపై కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవడానికి 60 రోజుల సమయం ఇస్తారు.ఆబాదీకి హక్కులు.. రాబడి: గ్రామ కంఠం (ఆబాదీ)లోని నివాస స్థలాలకు యాజమాన్య హక్కులు కల్పిస్తారు.వ్యవసాయేతర భూములకూ మ్యుటేషన్ అవకాశం ఉంటుంది. హక్కుల కల్పన ద్వారా ప్రజలకున్న నివాస స్థలాల ధరలు పెరుగుతాయి.వాటిపై రుణాలు తెచ్చుకోవడానికి అవకాశం ఉంటుంది. అధికారికంగా విక్రయించుకోవచ్చు. రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రాబడి పెరుగుతుంది.విచారణ అనంతరమే వారసత్వ

**బదిలీ:** వారసత్వ బదిలీకి సంబంధించి ఏక కాలంలో యాజమాన్య హక్కులు బదిలీ చేయరు. దరఖాస్తు అందిన తరువాత కుటుంబ సభ్యులకు నోటీసులు జారీ చేసి నిర్దిష్ట సమయం అనంతరం వారసత్వ బదిలీని నిర్వహిస్తారు.మ్యుటేషన్‌కు సర్వే పటం: భూమి మ్యుటేషన్ అధికారాలను ఆర్డీవో పరిధిలోకి తీసుకురానున్నారు. దీంతోపాటు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలోనే భూమి సర్వే సబ్ డివిజన్ పటాన్ని జత చేయాల్సి ఉంటుంది.ఆర్డీవో నిర్దిష్ట గడువులోగా మ్యుటేషన్ పూర్తి చేయాల్సి ఉంటుంది.

**భూధార్:** ప్రతి కమతానికి ప్రభుత్వం భూధార్ సంఖ్యను కేటాయించనుంది.ఇది ఎప్పటి నుంచి అనేది ప్రభుత్వం ప్రకటించాల్సి ఉంది. ఈ విధానంలో తాత్కాలిక,శాశ్వత ప్రాతిపదికన అనే రెండు రకాలుగా భూధార్ సంఖ్య, కార్డులను జారీ చేస్తారు. అక్షాంశాలు,రేఖాంశాల ఆధారంగా జియోగ్రాఫికల్ లొకేషన్ గుర్తించి భూములకు పక్కాగా హద్దులు నిర్ధారిస్తారు.సుమోటోగా సమీక్ష: ఏవైనా భూములకు లేదా భూ యజమానులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను లేదా సక్రమం కాని భూముల రికార్డులపై ప్రభుత్వం తనంతట తాను సమీక్ష చేసే అధికారం ఉంటుంది. అయితే,సంబంధిత వ్యక్తులకు నోటీసులిచ్చి, వారి వివరణను తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది.క్రిమినల్ చర్యలు: ప్రభుత్వ భూములకు ఎక్కడైనా దొడ్డిదారిన పట్టాపాసుపుస్తకాలు పొందినా, జారీ అయినా వాటిని రద్దు చేసే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. దస్త్రాల దిద్దుబాటు,ఏవైనా అక్రమంగా ఉత్తర్వులు జారీ చేస్తే సంబంధిత అధికారులను సర్వీసు నుంచి తొలగిస్తారు.

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# ఏఐసీసీ పిలుపు మేరకు చలో రాజ్ భవన్







**-డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**
ఏఐసీసీ పిలుపుమేరకు రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రులు,ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతో అదానీ కలిసి దేశ సంపదను కొల్లగొట్టారని దేశాన్ని అభివృద్ధి పథంలో కాకుండా అవినీతిపథంలో దూసుకుపోయేలా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మణిపూర్ ఘటనలో కేంద్ర ప్రభుత్వం తీరు చాలా బాధాకరమన్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కాంగ్రెస్ సైనికుల దేశం ప్రతిష్ట కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.దేశం బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న భావజాలంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి రాష్ట్రం కోసం ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి ప్రజల కోసం చేస్తున్న కార్యక్రమాలు చాలా సంతోషమని కాంగ్రెస్ కార్యకర్తలకు రేవంతన్న రోల్ మోడలని చెబుతూ అదానీ కుంభకోణాలపై జేపీసీ వేయాలన్న డిమాండ్లతో బుధవారం రాజ్ భవన్ కు మార్చ్ ఫాస్ట్ చేయడం జరిగిందని రామకృష్ణ తెలిపారు.

# ఖేడ్ ఎస్సైని సన్మానించిన సిపిఐ నాయకులు



**నారాయణఖేడ్, ప్రజా స్వేచ్ఛ**
నారాయణఖేడ్ మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీశైలంను బుధవారం ఖేడ్ సిపిఐ నాయకులు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ..మండల పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని,పట్టణంలో రోజురోజుకు కొత్తగా నిర్మించే ఇళ్లలో విద్యుత్ వైర్లను, వ్యవసాయ క్షేత్రాల వద్ద సర్వీస్ వైర్ల దొంగతనాలు ఈమధ్య పెరిగిపోయాయి కాబట్టి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం సిపిఐ నాయకులు చిరంజీవి,అశోక్, సతీష్,డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు గణపతి,సామాజిక ఉద్యమ కార్యకర్త మోహన్,లక్ష్మణ్, సాగర్,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఫార్ములా-ఈ" రేస్ అంశంపై రాష్ట్ర శాసనసభలో చర్చ జరిపించాలి

**శాసన సభాపతికి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు**



**కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ**
అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హరీష్ రావు నేతృత్వంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఇతర బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ ని కలిసి గత కొంతకాలంగా ఫార్ములా ఈ రేస్ పై వస్తున్న నిరాధార ఆరోపణలపై శాసనసభలో చర్చ జరిపించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "ఫార్ములా – ఈ" రేస్ నిర్వహణలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎటువంటి పొరపాట్లు చేయలేదని, నిబంధనల మేరకే "ఫార్ములా ఈ" నిర్వాహకులకు చెల్లింపులు జరిగాయని మా నాయకులు కేటీఆర్ ఇప్పటికే స్పష్టం చేశారని, ప్రభుత్వం మాత్రం "ఫార్ములా – ఈ" రేసింగ్ వ్యవహారంలో అవినీతి జరిగిందంటూ నిరాధార ఆరోపణలు చేస్తూ కక్షపూరితంగా బిఆర్ఎస్ పార్టీపై, కేటీఆర్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. నాలుగు గోడల మధ్య కాదు నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజలకు నిజా నిజాలు తెలియజేసేందుకు అసెంబ్లీ వేదికగా మా నాయకులు కేటీఆర్ చర్చకు సిద్ధంగా ఉన్నారని, కాబట్టి ఈ అంశాన్ని సభలో చర్చించేలా సభాపతి నిర్ణయం తీసుకోవాలి.

# ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులను చేయాలి

**-సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ భద్రు నాయక్**



**భద్రాద్రి ప్రజా స్వేచ్ఛ**
ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ నిధులు విడుదల చేయాలని ఐ టి డి ఏ , ఎ ప ఓ డేవిడ్ రాజు ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.2020 ఆర్థిక సంవత్సరానికి అప్పట్లో ఆన్లైన్ ఇచ్చి లబ్ధిదారుల ఎంపిక జరిగింది కానీ 2024 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న ఇప్పటికీ సబ్సిడీ నిధులు రిలీజ్ కాలేదు. ఏళ్లు గడుస్తున్న సబ్సిడీ రాకపోవడం చాలా బాధాకరం. గిరిజనులు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో పెట్టారు. ఈ స్కీం కి సబ్సిడీ నిధుల త్వరగా రిలీజ్ చేయాలని గిరిజనులు వేడుకుంటున్నారు. చెక్ నెంబర్లు జనరేట్ అయి ఏళ్లు గడుస్తున్న కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సంవత్సర కాలం గడిచింది దీని మీద శ్రద్ధ వహించి సబ్సిడీ నిధులను త్వరగా విడుదల చేయాలని సేవాలాల్ సేన విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ ఎన్ ఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు నునవత్ రాజా, బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా బిఆర్ఎస్

## పలు మృతుల కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ







**రాయపర్తి, ప్రజా స్వేచ్ఛ**

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటామని బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. రాయపర్తి మండలంలోని ఏకే తండా గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు హలవత్ రమేష్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స తీసుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారిని ఇంటి వద్ద పరామర్శించారు.అదేవిదంగా అదే గ్రామానికి చెందిన మాలోత్ వసుంధర్ తండ్రి మాలోత్ చంద్యా నాయక్,గుగులోత్ ఖీమా కూతురు హలావత్ కౌల్యా మరణించగా రాష్ట్ర మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు బాధిత కుటుంబాలను పరామర్శించారు.అంతకుముందు మృతుల పార్దివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బిల్లా సుదీర్ రెడ్డి,మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ రైతు బందు అధ్యక్షులు ఆకుల సురేందర్ రావు,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు జాజు నాయక్, మండల నాయకులు ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి, భాషాబోయిన సుధాకర్,కో ఆఫ్షాన్ అశ్రఫ్ పాషా, స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# మోదీ,వ్యాపార మోసగాడు అదానీ కలిసి దేశ ప్రతిష్టను దెబ్బతీసిన బడా చోరులు

## -చలో రాజ్ భవన్ ర్యాలీలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి



**హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ**

మోదీ,వ్యాపార మోసగాడు అదానీ కలిసి దేశ ప్రతిష్టను దెబ్బతీసిన బడా చోరులని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి అన్నారు.టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం నెక్లెసు రోడ్డు ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి భారీ ర్యాలీతో చలో రాజ్ భవన్ కార్యక్రమం పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ ఆధ్వర్యంలో రాజ్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు.దేశ ప్రధాని మోదీ వ్యాపార మోసగాడు అదాని కలిసి దేశ ప్రతిష్ట ను దెబ్బ తీసిన బడా చోరులంటూ,గౌతమ్ ఆదానీకి ప్రధాని మోదీ దేశ సంపద దోచి పెడుతున్నారని,దేశ ప్రజలు మేల్కొవాలని పిలుపునిచ్చారు. అదానీ అవినీతి.. మోసం.. మని లాండరింగ్,మార్కెట్ మానిపులేషన్ వంటి వాటితో దేశ ప్రతిష్ట దెబ్బతిసిన దేశ ద్రోహుల పార్టీ బీజేపీ అని విమర్శించారు.ఈ కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు దీప దాస్ మున్సి,ఉప ముఖ్య మంత్రి భట్టి విక్ర మార్క,రాష్ట్ర మంత్రులు,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,ఎమ్మెల్యేలు,రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

# టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమం

**కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ**

ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన చేపట్టిన చలో రాజ్ భవన్ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బారి ఎత్తున నాయకుల కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి తో నిరసన కార్యక్రమం లో పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సి మరియు ఎస్టీ సెల్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, ఐ ఎన్ టి యు సి నాయకులు బారి ఎత్తున్న పాల్గొన్నారు.

# పీజీ వైద్య ప్రవేశాల్లో 'స్థానికత'ఉత్తర్వుల రద్దు

- జీవో 148,149ల కొట్టివేత
- రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివితే స్థానికులే
- ఇతర రాష్ట్రాల్లో చదివిన వారికీ'స్థానికతపై రాష్ట్రపతి ఉత్తర్వులు' వర్తిస్తాయి
- తీర్పు వెలువరించిన హైకోర్టు



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్: ప్రజా స్వేచ్ఛ**

పీజీ వైద్య ప్రవేశాల్లో స్థానికత నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టు మంగళవారం రద్దు చేసింది. ఎంబీబీఎస్‌లో స్థానిక కోటా కింద రాష్ట్రంలో ప్రవేశాలు పొందిన వారే.. పీజీలో స్థానిక కోటా రిజర్వేషన్‌లకు అర్హులవుతారని, ఇతరులు రాష్ట్రంలో ఎంబీబీఎస్ చదివినంత మాత్రాన పీజీలో స్థానిక కోటా వర్తించదంటూ తెచ్చిన జీవో 148,149లను కొట్టివేసింది.తెలంగాణలో ఎంబీబీఎస్, బీహెచ్ఎంఎస్/ బీఏఎంఎస్ చేసినవారికి పీజీలో స్థానిక కోటా పరిధిలోనే ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని పేర్కొంది. తెలంగాణలో స్థానికులై ఉండి.. రాష్ట్రం వెలుపల ఎంబీబీఎస్ చదివిన, ఇన్‌సర్వీసు (తెలంగాణలో సివిల్ సర్జన్లుగా చేస్తున్న) అభ్యర్థులకు సైతం రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందని తెలిపింది. తెలంగాణలో విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయని స్పష్టం చేసింది.'2021 పీజీ మెడికల్ ప్రవేశాల నిబంధన 8'కి సవరణ చేసి అక్టోబరు 28న తీసుకువచ్చిన జీవో 148, 149లను సవాలు చేస్తూ హైకోర్టులో దాదాపు 98 పిటిషన్‌లు దాఖలయ్యాయి. ప్రస్తుత పిటిషనర్లలో దాదాపు అందరూ ఏపీ,రాజస్థాన్‌లలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. వీరితోపాటు చైనా తదితర దేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి తెలంగాణలో ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా సేవలందించినవారు కూడా.. తమను స్థానిక కోటా కింద తిరస్కరించడంపై పిటిషన్‌లు దాఖలు చేశారు.వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే,జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మంగళవారం 106 పేజీల తీర్పు వెలువరించింది.

**రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తిస్తాయి**

'రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించాలని కానీ,మార్చాలని కానీ రాష్ట్రపతిని ప్రభుత్వం కోరలేదు.ఈ క్రమంలో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95మేరకు.. తెలంగాణలో రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించవన్న వాదన అంగీకారయోగ్యం కాదు. ఆ చట్టంలోని సెక్షన్ 101 ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రభుత్వం అన్వయించుకోలేదనే వాదన సరికాదు. అందువల్ల చదువులకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు రాష్ట్రానికి వర్తిస్తాయి. స్థానికత ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించవచ్చు స్థానికత ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించాలన్న విధానం పూర్తిగా తొలగించాల్సినదికాదు. పీజీ కోర్సుల్లో స్థానికత ఆధారంగా ప్రవేశాలు కల్పించవచ్చు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. నాన్‌లోకల్ కేటగిరీలో రాష్ట్రంలో ఎంబీబీఎస్‌లో చేరినవారు స్థానిక కోటా కింద పీజీలో ప్రవేశాలకు అర్హులుకాదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 6 నుంచి ఇంటర్ వరకు రాష్ట్రంలో చదివినవారికే స్థానిక కోటా కింద ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు లభిస్తాయి.వారికే పీజీ ప్రవేశాల్లో స్థానిక కోటా కింద అర్హత లభిస్తుందన్న వాదన చట్టవిరుద్ధం.రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నాలుగేళ్లు స్థానికంగా చదువుకున్నట్లయితే స్థానిక అభ్యర్థిగా పరిగణించాలి. ప్రభుత్వ జీవోలు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధం. రాష్ట్ర విద్యాసంస్థల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 3(2)కు సైతం విరుద్ధం.2021 చట్టంలోని నిబంధన 8 ఇన్‌సర్వీసు అభ్యర్థులకు పూర్తిస్థాయి నిషేధం కల్పించలేదు.ఇందులో నిబంధన 1,6,8ల మధ్య తేడాలేదు.ఒకసారి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమయ్యాక నిబంధనలను సవరించడం సరికాదు.ఈ కారణాలతో జీవో 148,149లను కొట్టివేస్తున్నాం" అని తీర్పులో ధర్మాసనం పేర్కొంది.

**సుప్రీంకోర్టులో సవాల్**

ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ జీవోలపై విద్యార్థులు కోర్టును ఆశ్రయించడంతో రాష్ట్రంలో కాళోజీ వర్సిటీ పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువరించలేదు. మెరిట్ జాబితానూ విడుదల చేయలేదు.రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలన్న నిర్ణయంతో రాష్ట్రంలో పీజీ కౌన్సెలింగ్ మరింత ఆలస్యం కానుంది.హైకోర్టు తీర్పుపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను వివరణ కోరగా ఏజీ న్యాయ సలహాతో ముందుకెళ్తామని తెలిపారు.

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# గీత కార్మికుడిని పరామర్శించిన టీజీవైఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్,వెంకటేష్ గౌడ్




**వర్ధన్నపేట, ప్రజా స్వేచ్ఛ**

తాటిచెట్టు పై నుండి జారిపడి తీవ్ర గాయలైన గీత కార్మికుడిని తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్,నాగపురి వెంకటేష్ గౌడ్ లు పరామర్శించారు.మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన కల్లుగీత వృత్తిదారుడు ముత్యం ఏకాంబ్రం గౌడ్ బుధవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి కిందపడిన ఘటనలో తన రెండు చేతులు పూర్తిగా విరిగి తీవ్ర గాయాలయ్యాయని తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు నరేష్ గౌడ్ తెలిపారు.దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని,బాధితుడికి భార్య, చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారని వారికి ప్రభుత్వమే అండగా ఉండాలని కోరారు. అంతేకాకుండా తన వైద్య ఖర్చులు ప్రభుత్వం భరించాలని ఇది ప్రభుత్వ వైఫల్యమని దుయ్యబట్టారు.కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ లో ప్రభుత్వం ఏర్పాటు కాగానే గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందిస్తామని చెప్పి అధికారం వచ్చి సంవత్సరం గడిచినా ఇచ్చిన హామీలు ఒక శాతం కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు.ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గీత కార్మికుల పైన దాడులు మానుకొని గీత కార్మికుల రక్షణకై నడుంబించాలని,కలుగీత కార్పోరేషన్ తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.బాధితుడికి రెండు చేతులు విరిగి నరాలు తెగినందున ఆరోగ్యశ్రీ వర్తించడం లేదని,తన వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించి 10 లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గీత కార్మికుల రక్షణ కవచాలు పూర్తిస్థాయిలో అందించాలని లేని యెడల తెలంగాణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ ఆఫీసుల ఎదుట ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.గతంలో ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్,కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్ రాష్ట్రంలో ఏ గీత కార్మికుడు అయిన ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి పడితే 24 గంటల్లో తక్షణ సహాయం 25వేల రూపాయలు అందించడమే కాకుండా వారికి ప్రభుత్వం నుండి రావలసిన నష్టపరిహారాన్ని కూడా రెండు నెలలలో అందించేవారని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నుండి ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన గీత కార్మికులకు అందవలసిన తక్షణ నష్టపరిహారం ఇవ్వడం లేదని తెలిపారు.రాష్ట్రంలో రోజుకు పదుల సంఖ్యలో గీతా కార్మికులు ప్రమాదానికి గురవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం,రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.తక్షణమే ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేసి గీత కార్పొరేషన్ ను ఏర్పాటు చేయకుంటే రాబోయే స్థానిక ఎన్నికలలో గౌడ జాతి మోకు దెబ్బ రుచి చూపిస్తామని హెచ్చరించారు.గీత కార్మికుని పరామర్శించిన వారిలో గౌడ సంఘం నాయకులు చెంగల ఏకాంబరం గౌడ్,సాగర్ గౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

# బిజినెస్

## మూడోరోజు స్టాక్ మార్కెట్ల పతనం.. 502.25 పాయింట్లు దిగజారిన సెన్సెక్స్..!



స్టాక్ మార్కెట్ల పతనం కొనసాగుతున్నది. యూఎస్ ఫెడ్ రిజర్వ్ త్వరలోనే వడ్డీ రేట్లపై నిర్ణయం ప్రకటించనున్నది. ఈ సారి వడ్డీ రేట్లలో కోత విధింవచ్చన్న ఊహాగానాలున్నాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. అదే సమయంలో రూపాయి పతనం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మదుపరులు లాభాల స్వీకరణకు దిగుతుండడంతో మార్కెట్లన్నీ కుదేలవుతున్నాయి. బుధవారం వరుసగా మూడో రోజు మార్కెట్లు నష్టపోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,666.26 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే సెన్సెక్స్ నష్టాల్లోకి జారుకున్నది. ఇంట్రాడేలో 80,868.02 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. 80,050.07 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 502.25 పాయింట్ల నష్టంతో 80,182.20 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 137.15 పాయింట్లు పతనమై.. 24,198.85 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,379 షేర్లు పురోగమించాయి. మరో 2,456 షేర్లు పతనం కాగా.. మరో 92 షేర్లు మారలేదు. ఇక సెక్టోరల్ ఫ్రంట్‌లో ఫార్మా ఒకశాతం పెరిగింది. ఆటో, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, మీడియా, రియాల్టీ 0.5 శాతం నుంచి 2 శాతం వరకు దిగజారాయి. నిఫ్టీలో ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా, విప్రో, బజాజ్ ఆటో లాభాల్లో సాగగా.. టాటా మోటార్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, పవర్ గ్రిడ్ కార్ప్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎన్‌టీపీసీ నష్టపోయాయి. బీఎస్‌ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.5 శాతం చొప్పున తగ్గాయి.

# పసిడి కొనుగోలుదారులకు బిగ్ రిలీఫ్..!

## తులం ధర ఎంత పలుకుతుందంటే..?



పసిడి ధరలు కొనుగోలుదారులకు ఊరటనిచ్చాయి. దేశవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టగా.. వెండి ధర స్వల్పంగా పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర నిలకడగా కొనసాగుతున్నది. ఈ క్రమంలో దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధర పతనమైంది. దేశ రాజధాని ఢిల్లీలో పది గ్రాముల బంగారంపై రూ.200 తగ్గి తులానికి రూ.79,100కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. గత మూడురోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం బుధవారం రూ.500 పెరిగి.. కిలో ధర రూ.92వేలకు ఎగిసింది. ప్రస్తుతం బంగారం విషయంలో పెట్టుబడిదారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్నది. అయితే, ఈ సారి వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడుల విషయంలో అప్రమత్తం వ్యవహరిస్తున్నారు. ఎంసీఎక్స్‌లో గోల్డ్ రేటు రూ.74 పెరిగి.. పది గ్రాముల ధర రూ.76,945కి చేరుకుంది. ఫెడ్ రిజర్వ్ నిర్ణయంపై బంగారం ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పలువురు మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. ఇక వెండి ధర ఎంసీఎక్స్‌లో కిలోకు రూ.90,830కి చేరింది. ఆసియా ట్రేడింగ్ సెషన్‌లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్ 0.08శాతం పెరిగి ఔన్స్‌కు 2,664.10 డాలర్లకు చేరుకుంది యూఎస్ రిటైల్ సేల్స్ ఊహించినదాని కంటే మెరుగ్గా ఉన్న నేపథ్యంలో బంగారం ధరలు తగ్గాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గ్లోబల్ మార్కెట్‌లో వెండి ఔన్స్‌కు 30.92 డాలర్ల వద్ద స్థిరంగా ఉన్నది. ఇక దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే.. ముంబయిలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి ధర రూ.77,840 పలుకుతున్నది. చెన్నైలో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల స్వర్ణం రూ.77,840 వద్ద కొనసాగుతున్నది. హైదరాబాద్‌లో 22 క్యారెట్స్ గోల్డ్ రూ.71,350 ఉండగా.. 24 క్యారెట్ల పసిడి రూ.77,840 పలుకుతున్నది.

# మార్కెట్ రేసులో ఎలక్ట్రిక్ కార్ల వెనుకంజ..

### ఈ విభాగంలో స్కూటర్లదే దూకుడు



వాహనాల అమ్మకాల పరంగా ప్రపంచంలో మూడోస్థానంలో మన దేశం ఉంది. అత్యధిక జనాభా, సుస్థిర రాజకీయ వ్యవస్థ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ప్రగతి, ప్రజల ఆదాయాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ కార్లు వినియోగం విపరీతంగా పెరగాలి. కానీ అందుకు భిన్నంగా విక్రయాలు సాగుతున్నాయి. వీటి వినియోగంలో చైనాలో 30 శాతం, అమెరికాలో 12 శాతానికి పైగా ఉండే, మన దేశంలో మాత్రం ఏడు కంటే తక్కువగా ఉంది. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం క్రమంగా పెరుగుతోంది. అది కేవలం స్కూటర్లకు పరిమితమైంది. కార్ల వినియోగం అతి తక్కువగా ఉంది. భారతీయ మార్కెట్ లో టాటా మోటార్స్ ఆధిపత్యం చెలాయిస్తోంది. దాని వెనుక హ్యుందాయ్, మహీంద్రా, కియా, జేఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ ఉన్నాయి. దేశంలో 2030 నాటికి ఈవీల శాతం 30కి పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇది కొంచె కష్టమే అయినప్పటికీ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని భావిస్తోంది.

# గబ్బా టెస్ట్ డ్రా..

## టీమిండియా WTC ఫైనల్ ఆశలు సజీవం..!




బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో ఆస్ట్రేలియా-భారత్ మధ్య జరిగిన మూడో టెస్ట్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ తర్వాత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ WTC పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడవ స్థానంలోనే కొనసాగుతున్నది. అయితే, ఫైనల్‌కు చేరుకోవాలన్న భారత్ ఆశలు సజీవంగా నిలిచాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. గబ్బా టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా ఎనిమిది పరుగులు చేసింది. ఈ సమయంలో వరుణుడు మ్యాచ్‌కు ఆటంకం కలిగించగా.. ఇద్దరు కెప్టెన్లు మ్యాచ్‌ను డ్రాగా ముగించాలని నిర్ణయించారు.టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేసింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 260 పరుగుల వద్ద ముగిసింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. ఆ తర్వాత ఆసిస్ డిక్లేర్ చేశారు. దాంతో 274 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతున్నది. డ్రా నేపథ్యంలో ఇరుజట్లు పాయింట్లు పంచుకోవడంతో.. టీమిండియా పాయింట్లు 57.29 నుంచి 55.88కి పడిపోయాయి. పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉండగా.. దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉన్నది. WTC 2023-25 సైకిల్‌లో ఫైనల్‌కు చేరుకోవాలంటే.. భారత్ తప్పనిసరిగా రాబోయే రెండు మ్యాచ్‌లలో తప్పనిసరిగా ఓటమి నుంచి గట్టెక్కాల్సిందే.

# స్పోర్ట్స్

## రిటైర్మెంట్ ప్రకటించిన స్పిన్నర్ అశ్విన్




ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లో జరిగిన మూడవ టెస్టు చివరి రోజు అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించేశాడు. టెస్టు కెరీర్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు అశ్విన్. అతను 106 టెస్టుల్లో 24 యావరేజ్‌లో 537 వికెట్లు తీసుకున్నాడు. అనిల్ కుంబ్లే తర్వాత రెండో స్థానంలో ఉన్నాడతను. కుంబ్లే 132 టెస్టుల్లో 619 వికెట్లు తీసిన విషయం తెలిసిందే.ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్‌లో .. అశ్విన్ అడిలైడ్ టెస్టులో ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతను 53 రన్స్ ఇచ్చి ఓ వికెట్ తీసుకున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన హెూం సిరీస్‌లో అతను కేవలం 9 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అశ్విన్ టెస్టుల్లో 3503 రన్స్ చేశాడు. దాంట్లో ఆరు సెంచరీలు, 14 అర్ధశతకాలు ఉన్నాయి. క్రికెట్ ఆల్‌రౌండర్లలో అశ్విన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. మూడు వేల రన్స్, 300 వికెట్లు తీసిన 11 ఆల్‌రౌండర్ల లిస్టులో అతను ఉన్నాడు.రికార్డు స్థాయిలో అశ్విన్ 11 సార్లు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. మేటి స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్‌తో సమానంగా నిలిచాడతను.

# టీ20 ర్యాంకింగ్స్ టాప్-3లోకి మందన



**దుబాయ్**

భారత మహిళల స్టార్ క్రికెటర్ స్మృతి మందన తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో సత్తాచాటింది. మంగళవారం విడుదలైన ర్యాంకింగ్స్‌లో మందన వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని 734 పాయింట్లతో రెండో ర్యాంక్‌కు చేరుకుంది. రెండు ర్యాంక్‌లు చేజార్చుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్ 13వ ర్యాంక్‌కు పడిపోయింది. ఇటీవల ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డేలో సెంచరీ చేయడం ద్వారా మందన తన ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకుంది. మరోవైపు టీ20 ర్యాంకింగ్స్‌లోనూ 741 పాయింట్లతో ఒక స్థానం ఎగబాకిన మందన మూడో ర్యాంక్‌కు చేరుకుందో.



# రెమ్యునరేషన్ పెంచేసిన కీర్తి సురేష్..


## ఎన్ని కోట్లంటే..

హీరోయిన్ కీర్తి సురేష్ గురించి పరిచయం అక్కర్లేదు. మహానటి సినిమాతో ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ అందుకుంది. ఆ తర్వాత ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ ఓ స్టార్ డమ్ సంపాదించుకుంది. ఇటీవలే వైవాహిక బంధంలోకి అడుగుపెట్టింది.డిసెంబర్ 12న తన చిన్ననాటి స్నేహితుడు ఆంటోనితో కలిసి ఏడడుగులు వేసింది. వీరి పెళ్లి వేడుకకు సినీ ప్రముఖులు, బంధువులు, స్నేహితులు హాజరయ్యారు. కీర్తి సురేష్, ఆంటోని పెళ్లి ఫోటోస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.ఇదిలా ఉంటే.. ఇన్నాళ్లు దక్షిణాదిలో వరుస సినిమాలతో బిజీగా ఉన్న కీర్తి.. ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెడుతుంది. బేబీ జాన్ సినిమాతో నార్త్ అడియన్స్ ముందుకు వస్తుంది. ఇందులో వరుణ్ ధావన్ హీరోగా నటించాడు.బేబీ జాన్ సినిమాతో తొలిసారి ప్రేక్షకులను పలకరించనుంది. ఇప్పటివరకు కీర్తి నటించిన సినిమా పెద్దగా హిందీలో రిలీజ్ కాలేదు. ఈ మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగతున్నాయి. అయితే ఈ సినిమా కోసం కీర్తి భారీగానే డిమాండ్ చేస్తుందట.బేబి జాన్ సినిమాకు కీర్తి సురేష్ ఏకంగా రూ.4కోట్ల పారితోషికం తీసుకుంటుంది. తమిళంలో విజయ్ దళపతి నటించిన తేరీ సినిమాను తెరకెక్కించారు. ఇప్పుడు ఇదే సినిమాను ఇప్పుడు హిందీలో రీమేక్ చేస్తున్నారు. దీనికి దర్శకుడు అట్లీ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.



# ప్రభాస్ రాజాసాబ్ విడుదల వాయిదా..? టీజర్ రన్ టైం ఫైనల్

గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంపౌండ్ నుంచి హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న చిత్రం రాజాసాబ్ . మారుతి డైరెక్ట్ చేస్తు్న్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారని తెలిసిందే. సినిమా షూటింగ్‌కు సంబంధించి అభిమానుల్లో నెలకొన్న డైలామాకు చెక్ పెట్టాడు మారుతి. ఈ డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు.అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి మూవీ లవర్స్‌ను నిరాశ చెందేలా చేస్తుంది. రాజాసాబ్ విడుదల వాయిదా పడిందని వార్తలు వస్తుండగా.. మరోవైపు మీరు ఏ డేట్‌కు చూడాలనుకుంటే బాగుంటదో అదే తేదీన రాజాసాబ్ వస్తుందని మారుతి చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మరి రాజాసాబ్ విడుదలపై మేకర్స్ నుంచి అధికారికంగా ఏదైనా ప్రకటన వస్తుందేమో చూడాలి. అంతేకాదు రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్. రాజాసాబ్ మోషన్ పోస్టర్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రంలో మలబారు సోయగం మాళవిక మోహనన్ , ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ యాక్టర్ సంజయ్ దత్ కీ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు.



# పవన్ కల్యాణ్ ఓజీ సాంగ్‌లో డీజే టిల్లు భామ..!

టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ . సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోందిఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూలీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు




# తండేల్ శివశక్తి సాంగ్ రిలీజ్ టైం ఫిక్స్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్ . చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య–చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# గేమ్ ఛేంజర్' నుంచి మరో సాంగ్.. ధోప్' ప్రోమో రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ గేమ్ ఛేంజర్ . తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ మూవీ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే.ఆచార్య సినిమా వచ్చిన ఈ సినిమా డిజాస్టార్ అవ్వడంతో వారి ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న గేమ్‌ఛేంజర్ పైనే ఉన్నాయి. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి? కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు మూడు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మూవీ నుంచి మరోసాంగ్‌ను విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి 'ధోప్' అనే పార్టీ సాంగ్‌ను డిసెంబర్ 21న రిలీజ్ చేయునున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా సాంగ్ ప్రోమోను పంచుకున్నారు.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492